# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 20-02-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఢిల్లీలో పర్యటిస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పలువురు కేంద్ర మంత్రులతో సమావేశం కానున్నారు.**

2. **విశాఖపట్నం ఉక్కు కర్మాగారం 7.3 మిలియన్ టన్నుల మేర ఉత్పత్తి సాధించే విధంగా చర్యలు చేపట్టామని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు.**

3. **తెలంగాణలో లే అవుట్ల క్రమబద్ధీకరణ రుసుముపై 25శాతం మేర రాయితీ అందజేయనున్నామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు.**

4. **విపత్తులు, వరదల సాయంకింద కేంద్ర ప్రభుత్వం ఉభయ తెలుగు రాష్ట్రాలకు నిధులను విడుదల చేసింది.**

5. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం ఈనెల 23వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.**

===========================

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గత రాత్రి ఢిల్లీకి చేరుకున్నారు. ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటనలో భాగంగా పలువురు కేంద్ర మంత్రులతో సమావేశమై రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై చర్చించనున్నారు. ఈ ఉదయం కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు. ఈ సందర్భంగా పోలవరం ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల నీటి ప్రవాహ సామర్థ్యాన్ని పెంచేందుకు తగిన ఆర్థిక సాయంపై చర్చించనున్నారు. అనంతరం రామ్‌లీలా మైదానంలో జరిగే ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం కేంద్ర హోంశాఖమంత్రి అమిత్ షాతో సమావేశమై, రాష్ట్రానికి సంబంధించిన పలు ప్రాజెక్టులు, ఇతర సాయంపై చర్చించనున్నారని అధికారులు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో మిరప రైతులను ఆదుకునేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కోరారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు ఆయన లేఖ రాశారు. మార్కెట్ అసమానతల ద్వారా తగ్గిన ధరను భర్తీ చేసేలా చూడాలని కోరారు. సాగు వ్యయానికి, విక్రయధరకు మధ్య వ్యత్యాసాన్ని గుర్తించాలని కోరారు. వందశాతం నష్టాన్ని కేంద్ర ప్రభుత్వం భరించాలని పేర్కొన్నారు.

---------------------------

విశాఖపట్నం ఉక్కు కర్మాగారం మరో రెండు నెలల్లో 7.3 మిలియన్ టన్నుల మేర ఉత్పత్తి సాధించే విధంగా చర్యలు చేపట్టామని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజ్ శ్రీనివాస వర్మ తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, స్టీల్ ప్లాంట్ కు కేటాయించిన 11 వేల 400 కోట్ల రూపాయల ప్యాకేజీ అమలును కేంద్ర ప్రభుత్వం వేగవంతం చేసిందని చెప్పారు. పరిశ్రమలో ఉత్పత్తి పెరిగిందని కేంద్ర మంత్రి తెలియజేస్తూ,.

వాయిస్ ..37 సెకన్లు

---------------------------

తెలంగాణలో లే అవుట్ల క్రమబద్ధీకరణ పథకం–ఎల్ఆర్ఎస్ అమల్లో భాగంగా క్రమబద్ధీకరణ రుసుముపై 25% రాయితీ అందజేయనున్నామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో ఎల్ఆర్ఎస్ పథకం అమలుపై మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్‌బాబులతో కలిసి ఉపముఖ్యమంత్రి నిన్న సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మార్చి 31వ తేదీ లోపు ఈ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేసుకున్న వారికి ఎల్ఆర్ఎస్ రుసుములో రాయితీ వర్తిస్తుందని చెప్పారు.

---------------------------

భక్తులను ఆలయాలకు మరింత చేరువ చేసేందుకు చర్యలు చేపడుతున్నామని ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. తిరుపతిలో నిర్వహించిన అంతర్జాతీయ ఆలయాల సదస్సులో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. తిరుమలలో టికెట్ బుకింగ్, ఆలయ సర్వీసులు వంటి వ్యవస్థను మరింత సరళతరం చేస్తామని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వచ్చాయని, డ్రోన్లు, కృత్రిమ మేధ వినియోగంతో భక్తుల రద్దీ నియంత్రణకు చర్యలు తీసుకుంటామని తెలుపుతూ,

వాయిస్ ..26 సెకన్లు

---------------------------

గత సంవత్సరంలో వరదలు, విపత్తు కారణంగా నష్టపోయిన రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం తాజాగా 1,554.99 కోట్ల రూపాయలను విడుదల చేసింది. దేశంలో విపత్తు, వరదల సాయం కింద ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, నాగాలాండ్, ఒడిస్సా, త్రిపుర మొత్తం ఐదు రాష్ట్రాలకు కలిపి కేంద్ర ప్రభుత్వం నిధులను విడుదల చేసింది ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు 608.08 కోట్ల రూపాయలను కేటాయించగా, తెలంగాణకు 231.75 కోట్ల రూపాయలను కేటాయించింది.

---------------------------

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు.విజయవాడ కొత్త ప్రభుత్వ ఆసుపత్రిని మంత్రి నిన్న ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈసందర్భంగా రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఓపి, ఇతర విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించిన మంత్రి అధికారులకు పలు సూచనలు చేసారు. అనంతరం సత్యకుమార్ యాదవ్ పాత్రికేయులతో మాట్లాడుతూ....

వాయిస్ ...25 సెకన్లు

-------------------------

తెలంగాణలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశాల కోసం నిర్వహించే – ఈఏపీ సెట్ 2025 నోటిఫికేషన్‌ను విద్యా శాఖ ఈ రోజు విడుదల చేయనుంది. ఈ నెల 25 వ తేదీ నుంచి ఇందుకోసం దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఏప్రిల్, మేనెలలో పరీక్షలను నిర్వహించనున్నారు. పూర్తి వివరాల కొరకు eapcet.tgche.ac.in వెబ్ సైట్ లో వీక్షించాలని అధికారులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, కర్నూలు నగరాలలో ఈ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.

-------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 119వ సంచిక ఈనెల 23వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు రేపు సాయంకాలం వరకు పంపవచ్చు.

-------------------------

కుంభమేళాను పురస్కరించుకొని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమంలో నిన్న పవిత్ర స్నానం ఆచరించారు. గుంటూరు మాజీ పార్లమెంట్ సభ్యులు గల్లా జయదేవ్‌తో కలిసి కేంద్రమంత్రి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ, కుంభమేళాకు వస్తున్న కోట్లాది మంది భక్తులకు కేంద్ర, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాలు నిరంతరాయంగా సేవలు అందిస్తున్నాయని తెలిపారు. కుంభమేళాకు ప్రయాణికులను చేరవేయడంలో ప్రయాగ్‌రాజ్ విమానాశ్రయం సరికొత్త రికార్డు సృష్టించిందని కేంద్రమంత్రి పేర్కొన్నారు.

-------------------------

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా కుంభమేళాకు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది. హైదరాబాద్‌లోని చర్లపల్లి టర్మినల్ నుండి విజయవాడ, భువనేశ్వర్, పట్నా మీదుగా చర్లపల్లి, దానాపూర్ మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు తెలిపింది. ఈరోజు నుండి ఈనెల 28వ తేదీ వరకు వరకు చర్లపల్లి రైల్వే టెర్మినల్ నుండి ఈ ప్రత్యేక రైళ్ల సేవలు అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు.

-------------------------

తెలంగాణలో ప్రజల విజ్ఞప్తుల మేరకు కులగణనలో వివరాలు నమోదు చేసుకోని వారి కోసం మరో అవకాశం కల్పించామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హైదరాబాద్‌లో మంత్రి నిన్న మాట్లాడుతూ, ఇప్పటి వరకు సర్వేలో పాల్గొనని వారు ఈ నెల 28వ తేదీ వరకు వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. మూడు పద్ధతుల్లో కుల సర్వేలో సమాచారం అందించడానికి అవకాశం కల్పించామన్నారు.

-------------------------

సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం అందించే విషయంలో అవగాహన కల్పించేందుకు ఈ రోజు ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఐక్య రాజ్య సమితి పిలుపు మేరకు 2009వ సంవత్సరం నుండి ప్రతిఏటా ఫిబ్రవరి 20వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది. చట్ట పరంగా ఎటువంటి వివక్షత ...., తారతమ్యం లేకుండా ప్రజలందరికీ సమ న్యాయం అందించడం ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం.

=====================